క్లుప్తంగా

చిరు ధాన్యాల సాగుపై మొగ్గు చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ: చిరు ధాన్యాల సాగుపై బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి షణ్ముగం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాగులు, జొన్నలు, సజ్జలు, సాములు, అరికెలు, ఆరుతడి పంటలని, ఈ పంటల సాగుకు పెట్టుబడి వ్యయం తక్కువే కాకుండా నీటి సమస్య ఉండదని, ఇవి సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. చిరు ధాన్యాలు ఆరోగ్యకరమని, వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో వీటి సాగుకు రైతులు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం శైలజ, వ్యవసాయ సహాయకురాలు లావణ్య ఆయన పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీతో ఇంటి పన్ను

ఏర్పేడు: స్వర్ణ పంచాయతీ ద్వారా ఇంటి పన్ను చెల్లించవచ్చని డీపీఓ సుశీలాదేవి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె స్వర్ణ పంచాయతీపై అవగాహన కల్పించి ప్రజల చేత ఇంటి పన్ను కట్టించారు. సర్పంచ్ నల్లపాలెం శివయ్య, ఈఓపీఆర్డీ రమణకుమార్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని ఆన్‌లైన్ చేయండి



శ్మశానాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లి అరుంధతి వాడకు చెందిన 50 సెంట్ల శ్మశాన స్థలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సర్పంచ్ మంజుల, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని కోరారు. బుధవారం గ్రామానికి విచ్చేసిన తహసీల్దార్‌ను మంజుల కలిసి శ్మశాన సమస్యను వివరించారు. తహసీల్దార్ వెంటనే స్పందించి సర్పంచ్‌తో పాటు స్థలాన్ని పరిశీలించారు. శ్మశానానికే స్థలం చెందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీఆర్వో పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హరియాణా మాజీ సీఎం



శ్రీకాళహస్తి: హరియాణా మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే భూపిందర్ సింగ్ హుడా, ఎంపీలు జైప్రకాష్, దీపేందర్ హుడా, వరుణ్ చౌదరి, సత్పాల్ బ్రహ్మచారి, భరత్ భూషణ్ బాత్రా, ఎమ్మెల్యే సుభాష్‌చంద్ర బాత్ర, మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ డాంగీ, మాజీ మంత్రి సుబ్బీర్ కటారియా బుధవారం శ్రీకాళహస్తి ఆలయంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా సుందరరామిరెడ్డి

శ్రీకాళహస్తి: నియోజకవర్గ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా సుందరరామిరెడ్డిని నియమించారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పలువురు ఆయన్ను అభినందించారు.

శ్రీసిటీ సీఐ శ్రీనివాసులుకు పదోన్నతి



వరదయ్యపాళెం: శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న బీవీ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి లభించింది. ఆ మేరకు బుధవారం రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతి పొందిన డీఎస్పీ బీవీ శ్రీనివాసులుకు ఇంకా పోస్టింగ్ ఖరారు కాలేదు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు, సహచర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, శ్రీసిటీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

7న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ

తిరుపతి కల్చరల్: ఈనెల 7న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 280 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్‌కే.హుస్సేన్, రవిచంద్ర, చిరంజీవి పాల్గొన్నారు.

డయేరియా దడ దడ




బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాధితులు

- ఆస్పత్రి పాలవుతున్న గుత్తివారిపల్లె వాసులు
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో కొనసాగుతున్న వైద్యశిబిరం
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



డయేరియాకు కారణంగా అనుమానిస్తున్న బావి నీళ్లు

రేణిగుంట: గుత్తివారిపల్లిలో అనేక మంది వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిపాలయ్యారు. పల్లెలో మిగిలిన వారు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. డయేరియా వచ్చిందని అధికారులు అంటున్నారు కానీ దానికి కారణం రెండు రోజులైనా ఇంకా తెలుసుపోవడంపై గ్రామంలో పలు విమర్శలు ఎదుర్కొంటున్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో 60 కుటుంబాలకు డయేరియా సోకి బాధితులు ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం నుంచి డయేరియాతో బాధితులు బాధపడుతున్నారు. మంగళవారం వైద్య బృందం గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి తాగు నీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. కానీ ఇప్పటివరకు రిపోర్ట్ రాకపోవడంపై పలు విమర్శలు వినపడుతున్నాయి. బుధవారం చికిత్స పొందుతున్న బాధితులను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే బాధితులకు పండ్లు ఓఆర్ఎస్‌లను పంపిణీ చేశారు. డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వైద్యశిబిరాన్ని పరిశీలించి ప్రస్తుత పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్‌ఓ పరామర్శించారు. ఇంచార్జ్ ఎంపీడీఓ ప్రభురావు, మండల వైద్యాధికారి చక్రపాణిరెడ్డి తమ సిబ్బందితో గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

ఆర్వో వాటర్ సరఫరా..

గ్రామంలో అధిక శాతం మంది బోరు, ట్యాంక్ నీటిని తాగుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు వల్ల అధికారులు గ్రామంలోని నీటిని వినియోగించకుండా బయట నుంచి ఆర్వో వాటర్‌ను గ్రామంలో సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్లగా ఇదే నీళ్లు తాగుతున్నామని కానీ ప్రస్తుతం ఏమి జరిగిందో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

> **ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉంది..**
>
> గత మూడు రోజులుగా 40 మంది డయేరియాతో బాధపడుతున్నారు. అందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం అప్పటివరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుంది.
>
> –బాలకృష్ణనాయక్, డీఎంహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

హామీలను నెరవేర్చాలి: ఎస్టీయూ



బత్తలవల్లం ఉన్నత పాఠశాలలో సమావేశమైన ఎస్టీయూ నేతలు

వరదయ్యపాళెం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాల ని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వరదయ్యపాళెం మండలంలో వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బత్తలవల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని కోరారు. అనంతరం డివిజన్ కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని కోరారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు శ్యామ్ సుందరం, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. చెంగయ్య, వెంపళ్ల చిన్నయ్య, ఎస్టీయూ నాయకులు పూడి శ్రీనివాసులు, పరంధామయ్య, రంగనాథ్, వెంకటేశ్వర్లు, వీరయ్య, సుగుణ, మునెమ్మ పాల్గొన్నారు.

భూ ఆక్రమణ యత్నంపై విచారణ



తారకరామానగర్‌లో విచారణ జరుపుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన 30 సెంట్ల భూమిని టీడీపీ నేతలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అంబేడ్కర్ సంఘం సభ్యుడు రెడ్డప్ప జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, అర్బన్ సీఐ జయచంద్ర గ్రామానికి చేరుకొని విచారించారు. మండల సర్వేయర్‌తో సర్వే నిర్వహించి అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలంలో ఎవరు ఎటువంటి పనులు చేయలేదని ధ్రువీకరించారు. నిబంధనల ప్రకారం అంబేడ్కర్ సంఘం సభ్యులు అందరూ కలిసి భవన నిర్మాణం చేపట్టవచ్చని, అంబేడ్కర్ భవనం స్థలంలో వ్యక్తిగతంగా ఎవరు పనులు చేసినా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే డయేరియా



బాధితులను పండ్లు, ఓఆర్ఎస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నేతలు

రేణిగుంట: గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంతోనే అతిసార వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, అందరూ కలిసికట్టుగా పనిచేసే డయేరియాను నిర్మూలించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సూచించారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో డయేరియా వ్యాధితో బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని, గ్రామంలో వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం బుధవారం పరామర్శించి పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందని, దాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పుడో పాత కాలంలో ఇలాంటి వ్యాధులు గ్రామాల్లో వ్యాప్తి చెందుతుండేవని, కానీ ఇప్పుడు ఇంత మంది ఉండి ఇంత నెట్వర్క్ ఉండి ఇలా గ్రామంలో అందరికీ రావడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, న్యాయవాది తిరుమలరెడ్డి, దాముురెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు



ఇసుక ట్రాక్టర్‌కును

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై వాహనాలను నిలపడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వాహనాలను నిలపకూడదని సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మరమ్మతులకు గురైన వాహనాలను, ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా పెట్టుతున్నారని, దీనివలన షాపు యాజమానులు, లారీ, బస్సుల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆటో వాలాలు ఆటోలను ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదన్నారు. వాహనదారులు వాహనాలను మెయిన్ రోడ్డులో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుపై నిలిపిన ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా వేశారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు, పీఎస్ఐ సుధీర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్, అనిల్, వరమునీ, పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం యాగశాలలో అకల్మష ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన అనంతరం కల్యాణ మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం, సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్లు, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ ఏబీ.నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నవోదయ భవనం కోసం పరిశీలన

శ్రీకాళహస్తి: తాత్కాలిక జవహర్ నవోదయ స్కూల్ భవనం కోసం బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలుగు భవనాలను పరిశీలించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి కేంద్రీయ జవహర్ నవోదయ స్కూల్ మంజూరైంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవోదయ స్కూల్ మంజూరు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జిల్లా పీఓగా చాందిని



తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్టీసీ డిపో మెకానిక్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ చాందినిని ఆర్టీసీ జిల్లా పర్సనల్ ఆఫీసర్(పీఓ)గా నియతులయ్యారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీఓగా ఉన్న షహజాద్‌ను చిత్తూరు ఆర్టీసీ పీఓగా బదిలీ చేశారు.

సింహ వాహనంపై అవనాక్షమ్మ విహారం



నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించి మహిసాసురమర్ధినిగా సముదాయం గ్రామ వీధుల్లో విహరించారు. జాతరలో భాగంగా బుధవారం ఉదయం అర్చకులు శుద్ధి, తోమాల అనంతరం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సర్వాంగ సుందరంగా సుగంధపుష్పాలను, స్వర్ణాభరణాలను అలంకరించుకున్న అమ్మవారు సింహ వాహనం అధిరోహించి సముదాయం గ్రామ వీధుల్లో విహరించారు. మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓరవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ జాతరను పర్యవేక్షించారు.

నీళ్ల కోసం బోరుమంటున్నారు!



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామపంచాయతీ ఎన్‌టీఆర్‌నగర్ ఎస్సీ కాలనీలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని తాగునీటి చేతిపంపు మరమ్మతులకు గురి కావటంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా కిలోమీటరు దూరంలోని వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి శ్రమలకోర్చి తాగునీటిని తెచ్చుకొంటున్నారు. చేతిపంపు మొరాయించి ఏడాది కావొస్తున్నా అధికారులు ఇప్పటివరకు పట్టించుకున్న పాపానపోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్న తాధికారులు కాలనీ తాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ



కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థినులు

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీలో నెల రోజులుగా ఇస్తున్న కంప్యూటర్ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమిజబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్ శోభారాణి మాట్లాడారు. శిక్షణతో విద్యార్థినులు కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించడం అభినందనీయమన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

- పట్టించుకోని ప్రభుత్వం
- వృథాగా కోట్ల రూపాయల ఆస్తులు



శిథిలమైన పోలీస్ క్వార్టర్స్ భవనాలు



కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు



శిథిల దశకు చేరుకున్న పోలీస్ భవనాలు

వరదయ్యపాళెం: శాంతిభద్రతలను పర్యవేక్షించే రక్షకభటుల నివాస గృహాలు శిథిలమై పోతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురవడంతో పట్టించుకునే దిక్కులేదు. కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తుల గురించి ఆ శాఖ ఏమాత్రం బాధ్యతాయుతంగా ఆలోచన చేయడం లేదు. దీంతో వరదయ్యపాళెంలోని పోలీసులు నివాసముండే గృహాలు పూర్తిగా శిథిలమవుతున్నాయి. 1989లో అప్పటి ప్రభుత్వం, పోలీస్ సిబ్బంది నివాసాల కోసం వరదయ్యపాళెం హైస్కూల్ సమీపంలో నివాస గృహాలను ఏర్పాటు చేసింది. గత పదేళ్లుగా సంబంధిత భవనాలు పూర్తిగా శిథిలమై వినియోగంలో లేవు. దీంతో సిబ్బంది సైతం అద్దె నివాసాల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే శ్రీసిటీ, ఇతర పరిశ్రమలు, కల్కి ట్రస్టులు వరదయ్యపాళెం పరిసర ప్రాంతాల్లో ఉండడంతో అద్దె ఇళ్లకు వరదయ్యపాళెం ఎనలేని డిమాండ్ ఏర్పడింది. దీంతో అద్దెలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వేలకు వేలు అద్దెలు చెల్లించడం కూడా పోలీస్ సిబ్బందికి ఇబ్బందిగా మారుతోంది.

పట్టించుకోని పోలీస్ శాఖ

వరదయ్యపాళెం మండల కేంద్రంలో రెండెకరాల స్థలంలో పోలీస్ క్వార్టర్స్‌ను 1989లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.5కోట్లకు పైమాటే. అంతటి విలువైన ఆస్తులు ఉన్నప్పటికీ ఆ శాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సిబ్బంది బాగోగుల గురించి అసలే అనుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో శిథిలమైపోతున్న భవనాల చుట్టూ ఉన్న ఖాళీ స్థలం కొద్దిరోజులకు కబ్జాకాక తప్పదు. ఇప్పటికైనా పోలీస్ శాఖ కళ్లు తెరచి కోట్ల విలువైన భూమిపై ప్రత్యేక చొరవ చూపి సిబ్బందికి ఇళ్లు నిర్మించి మిగిలిన స్థలాన్ని పార్కు, ఇతర మౌలిక వసతులకు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.